క్లుప్తంగా

మహిళ ఆచూకీ లభ్యం

సాక్షి ఎఫెక్ట్..

పీసీ పల్లి: మా చెల్లి ఆచూకీ చూపించండయ్య అనే శీర్షికతో శుక్రవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు పోలీసులు స్పందించారు. మిస్సింగ్ అయిన నోసిన చెంచమ్మ యర్రగొండ పాలెంలో ఉన్నట్లు శుక్రవారం కనుగొన్నారు. ఆమెను తీసుకొచ్చి భర్త శ్రీను, సోదరులు బ్రహ్మయ్య, పేరయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులలో కదలిక వచ్చేలా చేసిన సాక్షి దినపత్రికకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్య పదార్థాలు లేకుండా గ్రేడింగ్ చేయాలి

కొండపి(సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని, అలాంటి బేళ్లకు అధిక ధర పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నేతివారిపాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1011 బేళ్లు వేలానికి తీసుకురాగా 959 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 52 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.320, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.256.05 పలికింది. వేలంలో 22 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

947 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 947 బేళ్లు కొనుగోలయ్యాయి. చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకి చేందిన రైతులు 988 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 41 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.320, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.249.10 ధర పలికింది. వేలంలో మొత్తం 35 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



టంగుటూరులో వేలాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీనివాసరావు

అల్లర్లకు పాల్పడితే చర్యలు

సీఎస్ పురం (పామూరు): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.రామానాయక్ హెచ్చరించారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో సీఐ రామానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో పలు అనుమానాస్పద గృహాల్లో తనిఖీలు చేపట్టారు. సీఐ రామానాయక్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ దృష్ట్యా ఎవ్వరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించినా, గ్రామాల్లో పాత కక్షలు పెట్టుకుని అల్లర్లకు పాల్పడినా అట్టివారిపై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు. ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలులేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ పురం ఎస్సై ఎం.ప్రేమ్‌కుమార్, పామూరు ఎస్సై ఎం.సైదుబాబు, వెలిగండ్ల ఎస్సై శివ, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో సీఐ, ఎస్సై, సిబ్బంది

కనుల పండువగా కోదండరాముని కళ్యాణం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా ప్రముఖ వ్యాపారవేత్త పులగర నారాయణరావు, చంద్రకళ వ్యవహరించగా ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పందిరిలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా సాగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన ఈఓ కేవీ ప్రసాద్, చీఫ్ పెస్టివల్ అధికారి శ్యాంసుందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చుట్టు ప్రక్కల మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు. ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, కూనపురెడ్డి ప్రకాశరావు, కావూరి ప్రభాకర్, ములుగు జాలిరెడ్డి, పురిణి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఊళ్లపాలెంలో సీతారాముల కళ్యాణోత్సవం జరుపుతున్న నిర్వాహకులు

పారిశుధ్యం మెరుగుపరచాలి

సింగరాయకొండ: పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండి అంటురోగాల వ్యాప్తికి అవకాశం ఇవ్వకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి రామారావుకు ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ సూచించారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచ్ బత్తుల శివరామిరెడ్డి , ఈఓఆర్డీ సుధాకర్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి విఫలయత్నం

సింగరాయకొండ: గతంలో చోరీ జరిగిన ఓ ఇంట్లో మరోమారు చోరీ చేసేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. ఈ సంఘటన సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడులో శుక్రవారం వెలుగుచూసింది. వివరాలు.. గ్రామంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రాజచంద్రశేఖర్ భార్యతో కలిసి వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో కుమారుడి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం చంద్రశేఖర్ రెండో కుమారుడు మనోజ్ ఇంటికి రాగా తలుపు తాళం తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పాటు దుస్తులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. విలువైన వస్తువులేవీ చోరీ కాలేదని మనోజ్ తెలిపారు. గత ఏడాది జూన్ ఒకటో తేదీన ఇదే ఇంట్లో 20 సవర్ల బంగారం, 10 కేజీల వెండిని దొంగలు అపహరించారు. గ్రామ శివారులో ఉన్న ఈ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించినా రాజచంద్రశేఖర్ ఆసక్తి చూపలేదు. దీంతో దొంగలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

గంగ తిరునాళ్లు ప్రారంభం



గంగమ్మ తల్లి మూలవిరాట్

పీసీ పల్లి: మండల పరిధిలోని వెంగళాపురం గ్రామంలో గల పాలేటి గంగమ్మ తిరునాళ్లు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రాతఃకాలమునే ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 5 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనుండగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులు రాలేదని నిర్వాహకులు తెలిపారు.

తిరుమలనాథస్వామి ఆలయానికి నైవేద్యం పాత్రల అందజేత



తిరుమలనాథస్వామి ఆలయానికి ఇత్తడి పాత్రలు అందజేస్తున్న దాతలు

సీఎస్ పురం (పామూరు): మండలంలో ప్రఖ్యాతి గాంచిన తిరుమలనాథస్వామి ఆలయానికి భక్తులు శుక్రవారం నైవేద్యం తయారు చేసే ఇత్తడి పాత్రలను అందజేశారు. మండలంలోని జినుగువారిపల్లి గ్రామానికి చెందిన పత్తి జయమ్మ ఇత్తడి పాత్రలను ఆలయంలో అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కనిగిరి ప్రజలకు సాగర్ జలాలు

కనిగిరి రూరల్: కనిగిరి సీపీడబ్ల్యూస్కీం వద్ద శుక్రవారం సాయంత్రం సాగర్ జలాలను కుళాయిలకు విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పోలురాజు తెలిపారు. స్కీంకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో పాటు ఎడ్జీ ఫీజులు పోతున్న కారణంగా సాగర్ జలాల సరఫరాకు అంతరాయం జరిగినట్లు చెప్పారు. మున్సిపల్ అధికారులు, విద్యుత్ సిబ్బంది అందరూ పూర్తిస్థాయిలో శుక్రవారం దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సమస్య లేకుండా మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. వాటర్ లీకులు కూడా లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆ మేరకు పట్టణ ప్రజలకు సాగర్ జలాలను కుళాయిల ద్వారా ట్యాంక్ దగ్గర విడుదల చేసినట్లు జేఈ తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

హనుమంతునిపాడు: సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కనిగిరి డివిజన్ ఏడీఏ కె.వెంకటరమణ రైతులకు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వీఏఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 10 క్వింటాల జీలుగలు, 11 క్వింటాల జనుములు, ఒక క్వింటా పిల్లిపెసర విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో రైతన్నలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రాయితీపై విత్తనాలు పొందవచ్చన్నారు. ముందుగా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకుని తగిన రుసుం చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు. జనుములు, జీలుగలు కేజీ రూ.44, పిల్లిపెసర విత్తనాలు రూ.67కు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఏఏలు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండి విత్తనాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.రమణ, వీఏఏలు ఆంద్ర కాశయ్య, రబ్బాని, సంధ్యాని, కొండలు, నవ్య, భారతి, ఖాదర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



వీఏఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

జూన్ 2 నుంచి మోపాడు గంగా భవానీ తిరునాళ్లు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయరు వద్ద గల గంగా భవానీ అమ్మవారి ఆలయంలో శ్రీగంగాభవానీ అమ్మవారి తిరునాళ్లను జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. 2న నిలుపు, 3, 4 తేదీల్లో అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ అమ్మవారి జలదిస్థానం, గావు, రాయభారం, 6న బండ్ల పొంగళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.



విశిష్ట అలంకరణలో మోపాడు గంగాభవానీ అమ్మవారి మూలవిరాట్

14 వాహనాలు స్వాధీనం

మర్రిపూడి: మర్రిపూడి దళితవాడ, గౌడాస్ కాలనీ, మర్రిపూడి పడమటి బజారులో శుక్రవారం కార్డన్ సెర్చ్, ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు కొండపి సీఐ పాండురంగారావు పేర్కొన్నారు. కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 14 వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీలో మర్రిపూడి, కొండపి, పొన్నలూరు ఎస్ఐలు శివబసవరాజు, కృష్ణబాజీరావు, వెంకటరాజేష్ పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ పాండురంగారావు